ఏమంటావు?!

5. రాము: అన్నమయ్య ఏ శతాబ్దానికి చెందినవాడో చెప్పు నువ్వు..

సోము: ఆయన ఇరవయ్యో శతాబ్దికి చెందినవాడేకదా...

రాము: కాదు. ఆయన పదహారో శతాబ్దికి చెందినవాడు.

సోము: మరి నాగార్జున కనీసం ఇంకా ముసలాడైనా కాలేదేమిట్రా మరి?!

6. సోము: రేయ్ రామూ! భారతదేశానికీ, జర్మనీకీ మధ్య దూరమెంతుంటుందో చెప్పరా!

రాము: సరిగ్గా మా నాన్న జానెడుతో జానడంటే జానెడేరా. నిన్ననే మా ఇంట్లో అట్లాస్ మీద కొలిచి మరీ చూసాము.

7. రాము: పొదుపు చేయడంలో ఎవరు ముందుంటారో చెప్పు నువ్వు..

సోము: ఇంకెవరు? సినిమా వాళ్లు!

రాము: వాళ్లేనని అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావు?

సోము: మరి వాళ్లే కదా బట్టల దగ్గరినుండీ చాలా పొదుపును పాటిస్తారు?!

8. రాము: ఒరేయ్ సోమూ ఇంతకీ నీ వయసెంతరా?

సోము: పన్నెండు.

రాము: పెళ్లయిందా?

సోము: లేదు.

రాము: మీ ఇంట్లో పెళ్లైనవారు ఇంకెవరైనా ఉన్నారా రామూ!

సోము: మా అమ్మానాన్నలు ఉన్నారు రా!








# కొత్త సంవత్సరం వచ్చింది!

కొత్తపల్లి పత్రిక ప్రారంభమై సంవత్సరం గడిచింది!

ఈ సంవత్సర కాలంలో అనుకున్నంత గొప్పగా కాకపోయినా, కొంత వరకు బాగానే నడిచింది పత్రిక. ఇప్పుడు ప్రతి నెలా నాలుగువందల మందికి పైగా పత్రికను చదువుతున్నారు. ఒక వంద పత్రికలు మా దగ్గరే అచ్చవుతున్నాయి; ఇరవై నుండి ముప్ఫై మంది వరకూ పత్రికను పూర్తిగా డౌన్లోడ్ చేసుకుంటున్నారు. కొత్తపల్లి పత్రిక గురించి దాదాపు అన్ని వార్తా పత్రికలూ ఏదో ఒక రూపంలో, తమకు నచ్చినట్లు, ప్రశంసిస్తూ రాసుకున్నాయి. ఒక దినపత్రికైతే, పేరు చెప్పకుండా ఏకంగా కొత్తపల్లి పత్రికలోని కథను, బొమ్మను వాళ్ల చిన్న పిల్లల పేజీలో ముద్రించుకున్నది!

పత్రిక కోసం హైదరాబాదు శాలిబండ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులైన శర్మ గారు, ఆదిలాబాదు జిల్లా భావురావుపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు రాంరెడ్డి గారు చొరవ తీసుకొని,

వాళ్ల బళ్లల్లో పిల్లల చేత కథలు రాయించి, బొమ్మలు వేయించి, పాటలు పాడించి పంపారు. హైదరాబాదు జె.ఎన్.టి.యు ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల బృందం ఒకటి కొత్తపల్లిలోని కథలకు చిత్రాలు వేసే బాధ్యతను నిర్వహించటం మొదలుపెట్టింది. ఇంకా అనేకమంది రచనలు పంపటం మొదలుపెట్టారు. ఇలా చాలా మంది మిత్రులౌతున్నారు.

అయినా ఇంకా వెలితి ఉన్నది.

పత్రికను చదివే వాళ్లందరికీ చాలా కథలు, పాటలు వచ్చు. అలవోకగా తెలుగులో రాసి పంపే వీలుంటే అందరూ విరివిగా రాస్తారు కదా! కొత్తపల్లి మాధ్యమంగా అలాంటి ఒక వ్యవస్థను అందుబాటులోకి తేగలిగితే, అలా ఇంటర్నెట్లోకి మరింత తెలుగు రాగలదు కదా, అని ఒక ఆలోచన.

కొత్తపల్లి పత్రిక వెనుక చాలామంది పిల్లల కృషి ఉన్నది. రచనలు చేయటం, సేకరించటమే కాదు, వాటిని టైపు చేయటం, తప్పులు సరిచూడటం, బొమ్మలు వేయటం, వాటిని ఒక క్రమంలో కూర్చటం - ఇవన్నీ పిల్లలే చేస్తున్నారు. వీళ్లలో ఎవరి కష్టాలు వారివి! కొందరి సమస్యలకు కుటుంబ కలహాలు కారణమైతే, కొందరికి అసలు కుటుంబాలు లేకపోవటం కారణం! కొందరివి ఆరోగ్య సమస్యలైతే, కొందరివి పై చదువులకు వీలుకాని పరిస్థితులు! వీళ్లను





# రాము-సోము

*రాము, సోము మాట్లాడుకుంటుంటే ఇప్పుడోసారీ, అప్పుడోసారీ వినిపించిన కొన్ని ముచ్చట్లు ఇవి:*
*సేకరణ: సయ్యద్, విష్ణు, మంజునాథ్, ఆదినారాయణ*

1. రాము: రేయ్ సోమూ! 2 + 2 + 2 + 2 = 8 అయితే 4 + 4 ఎంత అవుతుందిరా?
   సోము: అబ్బ, సులభమైందేమో నువ్వు చెప్పి, కష్టమైనదాన్ని నన్ను అడుగుతావా రా!
2. సోము: ఒరేయ్ రామూ, చెప్పరా! మూలధనం అని దేన్ని అంటాము?
   రాము: ఓసి ఆ మాత్రం తెలీదేంట్రా! ధనాన్ని బీరువాలోనుండి తీసి మూలలో పోస్తే అప్పుడు దాన్ని మూల ధనం అంటాం రా!
3. సోము: ఒరేయ్ రామూ, నీకు పాండవులు ఎవరో తెలుసా?
   రాము: ఓ! ఎందుకు తెలీదు? తెలుసు.
   సోము: మరి పాండవులను పంచ పాండవులని ఎందుకంటారో తెలుసా?
   రాము: వాళ్లు పంచెలు కట్టుకొనే వారేమో అందుకనే అయ్యుంటుంది రా!
4. రాము : ఠాగూర్ గారి పూర్తి పేరు చెప్పు సోమూ!
   సోము: భలే మంచి ప్రశ్నరా! జవాబు మెగాస్టార్ చిరంజీవి!

పిసినారి రాజుగారి అనారోగ్యం గురించి ఆ దేశ ప్రజలందరికీ తెలిసింది. ఒకనాడు వైద్యుడు ఒకడు రాజుగారి దగ్గరికి వచ్చి "నేను అడిగింది ఇస్తే మీ జ్వరాన్ని ఒక్క వారం రోజుల్లో పోగొడతాను" అని చెప్పాడు. "ఏమడుగుతావో అడుగు" అన్నాడు రాజు.

"ఏముంది మహారాజా, నాది చాలా చిన్న కోరిక. మీకు తెలుసుకదా, చదరంగం పటంలో మొత్తం అరవై నాలుగు గళ్లుంటాయి. మొదటి గడికి గాను నాకు ఒక బస్తా బియ్యం ఇవ్వండి. రెండవగడికి రెండు బస్తాలు, మూడవగడికి నాలుగు బస్తాలు, నాలుగవ గడికి ఎనిమిది బస్తాలు, ఇలా పటంలోని ప్రతి గడికిగాను ముందుగడికి రెండితల బియ్యపుబస్తాలు లెక్కగట్టి ఇస్తే చాలు" అన్నాడు ఆ వైద్యుడు.

రాజుగారు వెంటనే 'సరే' అన్నారు. అన్నట్లుగానే వైద్యుడు రాజుగారి జ్వరాన్ని ఒక్క వారం రోజుల్లో తగ్గించాడు. అప్పుడుగాని రాజుగారికి ఆ వైద్యుడు అడిగిన బహుమానం ఎంతవుతుందో లెక్క వేసే వీలు చిక్కలేదు. తీరా లెక్క తేలే సరికి రాజుకు మళ్లీ జ్వరం వచ్చినంత పనైంది!

మీరే చెప్పండి!

రాజుగారు వైద్యుడికి ఎన్ని బస్తాల బియ్యాన్ని ఇవ్వాలో!





సమయానుకూలంగా ఆదుకొనే దాతలు కొత్తపల్లి మాధ్యమంగా ముందుకు వస్తే బాగుండు కదా, అని ఇంకో ఆలోచన.

కొత్తపల్లి పత్రిక మరింత అందంగా, ఆకర్షణీయమైన రంగులతో రావాలని చాలామంది సూచించారు. పనుల ఒత్తిడి వల్ల ఇన్నాళ్లూ అది సాధ్యం కాలేదు. రాబోయే కొన్ని నెలల్లో రంగుల పరంగానూ, లేఔట్ పరంగా కూడానూ మార్పులు తేగల్గితే బాగుండుకదా, అని మరో ఆలోచన.

కొత్తపల్లి పత్రికను గత నెల నుండి రంగుల్లో ముద్రిస్తున్నాం. అయితే పత్రికను సమయానికి పంపే వ్యవస్థ ఇంకా బలపడాల్సి ఉంది. ప్రింటులో పత్రికకు మంచి ముఖచిత్రం, ఆ చిత్రాన్ని ముద్రించేందుకు ప్రత్యేకమైన కాగితం, ఇంకులు - ఈ పరంగా కూడా పని జరగాల్సి ఉన్నది.

కొత్తపల్లి పత్రికలో మరిన్ని శీర్షికల్ని - ముఖ్యంగా పిల్లలు గీచిన బొమ్మలు, సీరియళ్లు, నాటికలు, పద్యాలు - గద్యాలు చేర్చేందుకు కసరత్తు మొదలైంది. "కూడిక మెట్లు, సుడోకు, దారి కనుక్కోండి, క్విజ్ " వంటివి బహుముఖంగా విజ్ఞాన వినోదాల్ని అందించగలవు. మీ అందరి ఆదరాభిమానాలతో ఈ శీర్షికలన్నీ ఒకటొకటిగా త్వరలో మొదలవుతాయి.

ఇక, ఈ సంచికలో పతాకచిత్రం (డా.భీంరావు అంబేద్కర్, వసంతం,

గుడ్ ఫ్రైడే) అడవిరాముని కృషి ఫలం. భారత రాజ్యాంగ నిర్మాతల్లో ప్రథముడైన డా.అంబేద్కర్ ఏప్రిల్ పధ్నాలుగు,1891న జన్మించారు. ఈ నెల్లోనే వచ్చే గుడ్ ఫ్రైడే, ఏసు ప్రభువు పాప క్షమాపణకోసం రక్తాన్ని ధారవోసిన పవిత్ర దినం. ఇటువంటి మహనీయుల స్ఫూర్తితో మన జీవితాలను పునీతం చేసుకుందాం.

ఈ పిల్ల(ల) పత్రికను సంవత్సర కాలంగా ఆదరించిన మీకందరికీ విరోధినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు! విరోధిలో విరోధాలన్నీ సమసిపోవాలని ఆశిస్తూ,

స్నేహాభిలాషులు-

కొత్తపల్లి బృంద సభ్యులు.





# లెక్కలు నేర్చిన వైద్యుడు

*కొత్త పేర్లతో వస్తున్న పాత వ్యవస్థ ఒకటున్నది: మీరు పది రూపాయలు కట్టి సభ్యులవ్వాలి, మళ్ళీ మరో ముగ్గుర్ని సభ్యులు చేయాలి. వాళ్ళు మరో ముగ్గుర్ని.. ఇలా ఎన్ని వరసలమంది మీ వెనక సభ్యులయ్యారనేదాన్ని బట్టి మీకు లాభాలు వస్తుంటాయి. వీటన్నిటి వెనకా ఉన్న లెక్క చిన్నదే. గణితశాస్త్రంలో దాన్ని 'గుణశ్రేఢి' అనే పేరుతో వ్యవహరిస్తారు. సమస్య ఏంటంటే, పిల్లలు పరీక్షలు రాస్తుంటారుగానీ, ఆ సమస్యలు నిజజీవితంలో ఎలాంటి ముసుగులు వేసుకొని వస్తాయో తెలీక మళ్ళీ మళ్ళీ మోసపోతుంటారు. ఈ కథలాంటి సమస్యను చూడండి. ఎన్ని బస్తాలు బియ్యం కావాలో మీరే చెప్పండి.*

*సేకరణ: ఫ్లోరియాన్ కెక్, జర్మనీ*

పూర్వం చైనాలో ఒక రాజుగారు ఉండేవారు. ఆయన ఒట్టి పిసినారి. ఖర్చు చేస్తే డబ్బులు అయిపోతాయని వాటిని ఖజానా నుండి బయటికికూడా తీసేవాడు కాదు. దానితో ఇంకేముంది, ప్రజలంతా సరైన సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడేవారు. కానీ రాజుగారు మాత్రం అవేమీ పట్టనట్లుగానే ఉండేవారు.

ఒకసారి ఆ పిసినారి రాజుకు గొప్ప జ్వరం వచ్చి పట్టుకుంది. ఎంతగానంటే, అది రాజవైద్యుల వైద్యానికి ఏమాత్రమూ లొంగలేదు. రానురానూ రాజుగారి ఆరోగ్య పరిస్థితి దిగజారింది. ఆయనకిక ప్రాణభయం పట్టుకుంది.

ఎవరికి వారే బ్రతికేటందుకు శక్తిని మనమే ఇవ్వాలి
।ఓ యువతీ।

ఎందరొ వీరుల త్యాగఫలం ఈ దేశానికి స్వాతంత్రం
మనకెందుకులే అనుకొంటే ఏమయ్యేదో ఈ దేశం
అదే స్ఫూర్తి మీలో ఉంటే-అందరమొక్కటే అనుకుంటే
సమసమాజ నిర్మాతలు మీరై సమానత్వమే చూపాలి
సహజీవనమే చెయ్యాలి
।ఓ యువతీ।





# మంచిబడి

*ఆరవ తరగతి ఉమ మనిషిలాంటి కొండ, గాలిలో నిలబడే చేపలతో మొదలుపెట్టిన ఈ కథని మంచిబడితో ముగించింది! చదవండి, మీరున్నూ!*

*రచన: ఉమ, 6వ తరగతి, జి.బి.హెచ్.ఎస్, శాలిబండ, హైదరాబాదు.*

ఒక ఊరిలో రాజేష్ అనే పిల్లవాడు ఉండేవాడు. అతను ఎప్పుడూ మౌనంగా ఉండేవాడు. ఎవ్వరితోనూ సరిగ్గా మాట్లాడేవాడు కాదు. కానీ పద్యాలు, కవితలు, రచనలు వంటివి బాగా రాసేవాడు. అయినా అతనిని ఎవరూ ఏమంత మెచ్చుకునేవారు కాదు.

ఒకసారి రాజేష్ బడి నుండి ఇంటికి వెళ్ళేటప్పుడు, ఒక కొండను చూశాడు. అది చాలా విచిత్రంగా ఉంది. చూడగా అది ఒక మనిషి లాగా కనిపించింది! రాజేష్ కు ఆశ్చర్యం వేసింది. "భలే కొండ" అనుకున్నాడు.

ఇక ఆ రోజు చీకటిపడ్డాక ఇంట్లో నుండి బయటకు వచ్చి ఆకాశంలోకి చూశాడు రాజేష్. అప్పుడతనికి ఆకాశంలో ఒక అందమైన విమానం కనపడింది. "అబ్బ! ఏం విమానం! ఇలాంటిది నా దగ్గర ఒకటుంటే ఎంత బాగుంటుంది!" అనుకున్నాడు.



తెల్లవారగానే చిన్న చిన్న అట్టముక్కలన్నీ సేకరించి, వాటితో ఒక చక్కని విమానం బొమ్మను తయారు చేసేశాడు కూడా. "ఇంత అందమైన విమానంలో దేన్నైనా ఉంచితే బావుంటుంది. దేన్నుంచాలబ్బా?.." అని ఆలోచిస్తుండగానే పక్కన బొమ్మల బండి ఒకటి వెళుతూ కనిపించింది అతనికి. వెంటనే తను కూడబెట్టిన డబ్బులోంచి ఐదు రూపాయలిచ్చి, చక్కని చేప బొమ్మనొకదాన్ని కొన్నాడు. అతనికి అది చాలా ముద్దుగా అనిపించింది. దాన్ని తీసుకెళ్లి విమానంలో కూర్చోబెట్టాడు భద్రంగా.





# ఓ యువతీ యువకుల్లారా

*గానం మరియు డప్పు: టి: సతీష్, తొమ్మిదవ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా.*



ఓ యువతీ యువకుల్లారా
సామాజపు సారధులారా
ఈ దేశానికి మీరే యుగకర్తలు కావాలి
రేపటి తరానికీ మీరే మార్గదర్శకులవ్వాలి
।ఓ యువతీ।

పేదరికం ఒక శాపం కాదు
ఎవరి నుదుటా అది రాసిలేదు
ఏదో గ్రహణం పట్టింది
బ్రతుకును చీకటి అలుముకుంది
ఆ చీకటిని తరిమేసే కాంతి రేఖలుకావాలి
బ్రతుకు బాటను చూపాలి
।ఓ యువతీ।

కూడూ గూడూ లేక పడియున్న దీనులకు
ఎవరొస్తారని అలసిపోయిన అభాగ్య జీవులకు
మేమున్నామని చెప్పాలి-నమ్మకాన్ని పెంచాలి

నెచ్చెలికోసం నాట్యం చేసే నెమలి పించపు రంగులు చూడు
।ఓ తంగేడుపూత।

అమ్మవోలే ఆకలి తీర్చే తియ్యని ఫలములు ఇచ్చే చెట్లు
ఎన్నోజీవుల అక్కున చేర్చి ఆదరించే దేవతలట్లు
ప్రాణికోట్లను రక్షించేటి ప్రాణ వాయువును అందిస్తాయి
తల్లిని పోలిన గొప్పది చెట్టు తట్టి చూడు మది నీకే తట్టు
।ఓ తంగేడుపూత।



కొత్తపల్లి ఏప్రిల్ 2009

ఇక ఆ రోజు రాత్రి నిద్ర మధ్యలో లేచి, అనుకోకుండా ఆకాశంలోకి చూశాడు రాజేష్. చూస్తే, విమానం ఒకటి గిరగిరాలు కొడుతూ కనిపించింది. నక్షత్రాలతో ఆడుకుంటున్నట్లు ఎగురుతోంది, ఆ విమానం! ఒకసారేమో పైకి ఎగురుతుంది; మరోసారి కిందికి వచ్చినట్లు అనిపిస్తుంది; మరోసారేమో అక్కడే నిలబడినట్లు అనిపించింది! "ఇంత రాత్రి వేళల్లో కూడా విమానాలు ఇట్లా ఎగురుతాయా!" అని రాజేష్ కి ఆశ్చర్యం వేసింది. దానికి తను తయారుచేసిన విమానాన్ని చూపెడదామనిపించింది. ఇంట్లోకి పరుగెత్తాడు. వెళ్ళి చూస్తే అక్కడ విమానం లేదు! వెంటనే బైటికి వచ్చేశాడు రాజేష్ "ఎటు వెళ్లింది, ఇది?" అనుకుంటూ.

అంతలోనే, ఎగురుతున్న ఆ విమానంలోంచి చేప ఒకటి సర్రున వచ్చి రాజేష్ ముందు నిలబడింది- గాలిలోనే.

"ఏంటి రాజేష్, అలా చూస్తున్నావు?" అని అది రాజేష్ ని అడిగింది.

అప్పుడు రాజేష్ "నువ్వు చేపవు. ఎలా మాట్లాడగల్గుతున్నావు?" అని అడిగాడు.

అప్పుడు ఆ చేప "నేను చేపను కాను". "మనిషి లాగే ఉండే ఒక కొండను" అంది.

"నువ్వు చేపవు..కొండవి ఎలా అవుతావు?" అని అడిగాడు రాజేష్.

అప్పుడు చేప "రాజేష్! నువ్వు మొన్ననే నన్ను చూశావు. గుర్తుందా?" అని అడిగింది.

"నిన్ను ఎప్పుడు చూశాను నేను?" అన్నాడు రాజేష్.

"మొన్న, బడి నుండి ఇంటికి వెళుతూ నువ్వు చూసిన మనిషి లాంటి కొండను నేనే!" అన్నది అది.

"ఆ... గుర్తొచ్చింది, కానీ ఆరోజు చూసినప్పుడు నువ్వు మనిషిలా ఉన్నావు; ఇప్పుడు చూస్తే చేపలా ఉన్నావు! నాకు ఏమీ అర్థం కావట్లేదు" అన్నాడు రాజేష్.

"ఇప్పటి చేపనూ నేనే! అప్పటి కొండనూ నేనే! అంతే కాదు ఇప్పటిదాకా పైన ఎగిరిన విమానాన్ని కూడా నేనే! అన్నీ నేనే, హ హ హ!" అని నవ్వింది చేప.

"నేను చూసినవన్నీ నువ్వే అంటున్నావు. ఇంతకీ ఎవరు, నువ్వు?" అని అడిగాడు రాజేష్.

అప్పుడు చేప "నిజానికి దివ్యశక్తులు గల ఒక పక్షిని నేను!" అన్నది. అంటూండగానే దానికి రెక్కలు మొలిచాయి. ఇప్పుడు అది పక్షిలా మారిపోయింది.

ఆశ్చర్యంగా చూస్తున్న రాజేష్ తో అది మళ్లీ అంది. "రాజేష్, నువ్వు





# తంగేడుపూత నేరేడుకాత

*గానం: బి. కుమారి, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సెంటర్, చెన్నేకొత్తపల్లి.*

*డప్పు: టి. సతీష్, తొమ్మిదవ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా.*



ఓ.. తంగేడుపూత నేరేడుకాత
గువ్వలమోత కోయిల కూత
అడవితల్లికి అందమయ్యింది
ఈ అడవికంటే స్వర్గమేడుంది
।ఓ.. తంగేడుపూత।

పువ్వుల పైన తుమ్మెద రాగం తియ్యని పాటలు తలపిస్తుంటే
సెలయేటి దూకుడుల్లో మద్దెల మోతలు వినిపిస్తుంటే
పిల్లగాలికి పచ్చని చెట్లు నాట్యం రీతి కదులుతు ఉంటే
ఆ సుందర దృశ్యం చూడటానికి రెండు కళ్ళూ చాలవన్నా
।ఓ.. తంగేడుపూత।

ప్రకృతి ఇచ్చిన ఆశలల్లే గండుశిలల బారులు చూడు
బెదురు చూపులతో వాటిపై ఎగిరే లేడిపిల్లల గుంపులు చూడు
తోడుకోసం రొప్పులు రొప్పే ఎలుగుబంటి అరుపులు చూడు

ఒకరికి ఒకరం తోడుంటాం టింబక్టు బడిలో కలిసుంటాం
|ఎక్కడెక్కడో|

కులమంటే తెలియదు మాకు మతమంటే చిరాకు మాకు
స్నేహానికి ప్రాణం ఇస్తాం సహవాసానికి మేమే రూపం

కలిసికట్టుగా ఉంటాము ఆనందంగా జీవిస్తాం
|ఎక్కడెక్కడో|





ఒక కోరిక ఏదైనా కోరుకో" అని.

అప్పుడు రాజేష్ "నేను మంచి స్కూల్ లో చదువుకోవాలని దీవించు" అని అడిగాడు.

అప్పుడు ఆ పక్షి "అలాగే. కానీ నాకు ఓ సంగతి చెప్పు, మంచి బడి అంటే ఏమిటి? ఎట్లా ఉంటే 'మంచి స్కూలు' అని తెలుస్తుంది?" అని అడిగింది.

"నాలా బాగా ఆలోచించే పిల్లలను మెచ్చుకునేదే మంచి బడి" అని చెప్పాడు రాజేష్.

"అంటే, ఇప్పుడు నువ్వు చదువుకుంటున్న బళ్లో ఎవ్వరూ నిన్ను మెచ్చుకోవటం లేదా?" అని అడిగింది పక్షి.

మెల్లిగా తలవాల్చుకున్నాడు రాజేష్.

"అది సరేలేగానీ.. నువ్వు ఎవరెవర్ని మెచ్చుకుంటావు రోజూ?" అడిగింది పక్షి.

"ఎవరైనా నాతో మాట్లాడితేనేగా.. నేను మెచ్చుకోవడమూ, మరేదైనా చేయడం" అన్నాడు రాజేష్.

"అయినా, ఒకరు నిన్ను మెచ్చుకోవాలనే కోరిక నీకు ఎలా ఉందో, అలాగే అదే కోరిక మిగతా పిల్లలకూ ఉండవచ్చుగా?" అని రాజేష్ ను

అడిగింది పక్షి.

'అవును, ఉండవచ్చు' అన్నాడు రాజేష్.

'ఇంకొకరు చేసిన మంచి పనిని నువ్వు మెచ్చుకోవడం మొదలుపెట్టు రాజేష్! అప్పుడు నిన్ను కూడా మెచ్చుకునే వాళ్ళు వస్తారు' అని రాజేష్ తో ఆప్యాయంగా చెప్పింది పక్షి.

విషయం అర్థమైన రాజేష్, తరువాతి రోజు నుండీ ఇతరులతో మంచిగా మాట్లాడడం, ఇతరులకు తన శక్తిమేర సహాయం చేయడం, తనకు కొత్త విషయాలు తెలిస్తే ఇంకొకరికి తెలియజెప్పటం మొదలు పెట్టాడు. కొన్ని రోజుల్లోనే తరగతిలోని మిగతా పిల్లలూ రాజేష్ తో స్నేహంగా మెలగసాగారు- చదువుల పరంగా కూడా సహాయం చేయటం మొదలుపెట్టారు. పిల్లలలో వచ్చిన మంచి మార్పు అందరినీ ఆనందింపజేసింది. అందరూ ఉపాధ్యాయుల మెప్పునొందారు.

దీన్నంతా గమనిస్తూండిన పక్షి సంతోషంతో ఎగురుకుంటూ పోయింది. మనిషిలాంటి కొండ ఎండకు బంగారం మాదిరి మెరిసింది.





# ఎక్కడెక్కడో పుట్టాము

*సేకరణ: శ్రీ వెంకటేశ్, వంశీ, సాంస్కృతిక శిక్షణా కళాకారులు, అనంతపురం.*

*గానం: అనిత, తొమ్మిదవ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి*

*డప్పు: టి. సతీష్, తొమ్మిదవ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.*

ఎక్కడెక్కడో పుట్టాము ఎక్కడెక్కడో పెరిగాము
ఎక్కడెక్కడో పుట్టాము ఎక్కడెక్కడో పెరిగాము

అనుకోకుండా కలిసాము అందరమొకటిగ ఉన్నాము
అనుకోకుండా కలిసాము అందరమొకటిగ ఉన్నాము

మేమంతా ఒక గూటి పక్షులం
టింబక్టు వృక్షం పైన చిగురించాము
|ఎక్కడెక్కడో|

అమ్మా నాన్నా మాకున్నా అన్నా తమ్ముళ్ళు మాకున్నా
ఆటలు పాటలు అన్నీ ఉన్న టింబక్టు బడి మాకు మిన్న

ఇంటికి రాజు మా నాన్న - నాన్నకు తోడు మా అమ్మ
ఇంటికి రాణి మా అమ్మ - అమ్మకు తోడు అమ్మమ్మ
అందాల మా ఇల్లు - ఆనందాల హరివిల్లు





# మూడు మంచాల కథ

*రచన:ఎస్.భరత్, తొమ్మిదో తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.*

"కళ్లు మండుతున్నాయమ్మా! ఇక నీళ్ళు పోసెయ్, త్వరగా!" అంటున్నాడు పిల్లాడు.

"మొహం బాగా కడుక్కోకపోతే గుల్లలు లేస్తాయిరా నాన్నా! కాస్త సహనం అలవరుచుకోవాలి, ఇక నుండి నువ్వు" అటోంది అమ్మ.



"సహనం అంటే ఏంటమ్మా?" అని అడిగాడు అబ్బాయి.

"సహనమంటే భూమాతరా నాన్నా!" అన్నది అమ్మ.

"భూమాతంటే ఎవరమ్మా?" అడిగాడు అబ్బాయి.

"భూమాతంటేనా!" అంటూ ఈ చక్కని కథను తన కొడుకుతో చెప్పింది తల్లి:

ఒక గదిలో ముగ్గురు స్నేహితులుండేవాళ్లు. ఒకనాటి మధ్యాహ్నం, వాళ్లంతా పనులమీద బయటికి వెళ్లిన సమయంలో, వాళ్ల మంచాలు మూడూ మాట్లాడుకోవడం మొదలుపెట్టాయి.

ఒక మంచం అన్నది " అబ్బా! ఎంత బరువున్నాడో వీడు. మొయ్యలేక చస్తున్నా, రెండేళ్ల నుండీ!. ఇలా ఎంత కాలంరా నాయనా?" అని.

ఇంతలో రెండవ మంచం అందుకొని "ఇంతకీ వాడి బరువెంత?" అని అడిగింది.

"యాభై ఆరు కేజీలట. ఒకనాడు చెప్పుకుంటూంటే విన్నాను." అన్నది మొదటి మంచం. తన గొంతును చిన్నదిగా చేస్తూ.

రెండవ మంచం అన్నది "యాభై ఆరు కేజీలేనా? నువ్వే అలా అంటే మరి నేనేమనాలి? మూడేళ్ల నుంచి వీడి బారిన పడ్డాను. బరువును మోస్తూనే ఉన్నాను." అని.





# అందాల మా ఇల్లు

*అందాల మా ఇల్లు*

*గానం: వి. రాజు, నాలుగవ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా.*



అందాల మా ఇల్లు
ఆనందాల హరివిల్లు

ఇంటి ముందర బాట -
ఇంటికి వెనుక తోట
మా ఇల్లు ఒక కోట - గర్విస్తుంది మా పేట
అందాల మా ఇల్లు - ఆనందాల హరివిల్లు

అమ్మా నాన్న అన్నయ్య - తాతా బామ్మా మామయ్య
జూలీ డాలీ రంగయ్య - మా ఇంట్లోని వాళ్లయ్య
అందాల మా ఇల్లు - ఆనందాల హరివిల్లు

శాంతికి నిలయం మా ఇల్లు - ప్రేమకు వలయం మా ఇల్లు
స్వచ్ఛత అంటే మా ఇల్లు -క్రమశిక్షణకు మాఇల్లు
అందాల మా ఇల్లు - ఆనందాల హరివిల్లు

# అడవుల కొండల గుట్టలకు

*అడవుల కొండల గుట్టలకు*
*గానం: పుష్ప మరియు ఉష, ఏడవ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.*
*డప్పు: పోతులయ్య*



అడవుల కొండల గుట్టలకూ
చందామామయలో....
చందామామయలో
నిప్పు పెట్టితే మనకే ముప్పు
చందామమయలో
।అడవుల।

ఎండు కట్టెల కోసం మనమూ చందామామయలో..... చందామామయలో
మంటలు ఎగదోస్తున్నామూ చందామామయలో - చందామామయలో
అడవులు కొండలు కాల్చుకుపోతే చందామామయలో - చందామామయలో
వానలు మనకు కరువైపోతాయ్ చందామామయలో - చందామామయలో
।అడవుల।
అడవుల కొండల సరిహద్దుల్లో చందామామయలో..... చందామామయలో
బీడీ, సిగరెట్, అగ్గిపుల్లలూ - చందామామయలో - చందామామయలో
ఆర్పకుండా విసిరేయ్యొద్దు చందామామయలో - చందామామయలో
అడవులంటే అన్న దాతలు చందామామయలో- చందామామయలో
।అడవుల।





మరి "వాడి బరువెంత?" అని అడిగింది మొదటి మంచం. "అరవై రెండు కేజీలు" దీర్ఘంగా రాగం తీస్తూ అన్నది రెండవ మంచం.

"మేమిద్దరం మాట్లాడుతుంటే నువ్వేమీ మాట్లాడకుండా ఉన్నావేమిటి? నీకేమీ బరువులు లేవా?" అని అవి రెండూ మూడవ మంచాన్ని అడిగాయి.

అందుకు మూడవ మంచం బదులిస్తూ, "బరువులేకుండా ఎలా ఉంటాడు? ఉన్నాడు. అయినా నాకేమీ ఇబ్బంది లేదు. మనమున్నది బరువును మోయడానికే కదా! చిన్న చిన్న బరువులను మోస్తున్న మనం ఈ పని చేయడానికి ఇలా బాధపడకూడదు. మనమే ఇలా అంటే మనందరినీ మోస్తున్న ఈ భూమాత ఏమనాలి మరి? ఏమీ అనకుండా ఎంతో సహనంగా మోస్తున్నది కదా! దేనికైనా ఓర్చుకుంటున్నది కదా! అలాంటి గొప్ప సహనమే మనం అలవరచుకోవాలి" అని మూడవ మంచం ఎంతో సహనంగా చెప్పింది.

"మూడవ మంచం చెప్పినట్టు, నిజంగానే గొప్ప సహనశీలిరా నాన్నా, భూమాత! ఆ సహనం మనందరికీ ఎంతో అవసరం. చిన్న చిన్న వాటన్నింటికీ పెద్దగా అరవకూడదు" అని చెప్తూ స్నానం అయిపోజేసిన ఆ అమ్మ, తన కొడుకును స్నానాలగది నుండి బయటికి ఎత్తుకొచ్చింది మురిపెంగా.

# చక్రంలో ఈగపిల్ల

*చక్రంలో ఈగ పిల్ల*

*రచన: నారాయణ, కొత్తపల్లి బృందం.*

ఒక ఈగ పిల్ల ఎగురుతూ పోతూంటే దానికో సైకిల్ చక్రం కనిపించింది.

అన్ని చక్రాలూ నల్లగా, మురికిగా ఉంటే, ఈ చక్రం మాత్రం తెల్లగా మెరిసిపోతోంది. మూడు చక్రాల సైకిల్ దేమో, చిన్నగా ఉంది. మోటార్ సైకిల్ చక్రానికి మల్లే దాని లోపల ఐదు నీలం రంగు కడ్డీలు ఉన్నాయి. మొత్తం మీద చాలా తేలికగా ఉంది అది.

దాన్ని చూసేసరికి ఈగ పిల్లకు చాలా సంతోషం వేసింది.

"భలే! ఇక నేను ఎగరాల్సిన పని లేదు. దీని మీద కూర్చుని దొర్లించుకుంటూపోతే సరి!" అనుకుంది.

ఒక్కసారి ఎగిరి దాని టైరు మీద వాలిందోలేదో, ఆ చక్రం దొర్లటం మొదలెట్టింది. మరుక్షణంలో చక్రం పైనున్న ఈగ తలకిందులుగా చక్రం అడుక్కి వచ్చేసింది. ఇంకా కొంచెం ఆగి ఉంటే అది చక్రం కింద పడి నలిగిపోయేది! ఈగ వెంటనే పైకి ఎగిరి, మళ్ళీ చక్రం టైరు మీద





# చందమామా చందమామా

*చందమామని మల్లి మాట అడిగే ఈ పాట, అనంతపురం జిల్లా 'కోలాటం' పాటల్లో ఒకటి. బహుశ: దీని పూర్తి పాఠం ఇది కాదేమో అనిపిస్తుంది వింటే. ఇంకా ఉండి ఉండాలి. మీకేమన్నా తెలిస్తే పంపండి.*

*గానం: అనిత, శారద మరియు కళావతి. డప్పు: సతీష్, తొమ్మిదవ తరగతి.*



చందమామా చందమామా
చక్కనైన చందమామా!
మళ్ళీ అడుగుతున్నా
మల్లి మాట చెప్పు మామా!

ఇంటి ముందర వనమంతా వనమూలో మనమంతా
మళ్ళీ అడుగుతున్నా మల్లి మాటా చెప్పుమామా!

చందమామా చందమామా చక్కనైన చందమామా!
మళ్ళీ అడుగుతున్నా మల్లి మాటా చెప్పుమామా!

చక్కనైన చందమామా ఏ చుక్కల్లో దాగుందో!
నీకు తెలిసి ఉంటే నాతో చెప్పి పోరా మామా!

కాల్వల్లో నీరు పరుగులు తీస్తూ కయ్యలో నీరు నిలిచిపోవాలి

బీడు భూములన్నీ....ఓ..హొయ్
బీడు భూములన్ని తడితో తడిపి నేలకు నీరును నింపాలమ్మా
బోరు బావుల్లో నీళ్ళను నింపి భూగర్భ జలాలు పెంచాలమ్మ
|పెద్ద|

రైతు గుండెకు దిగులే వద్దు దిగుబడులెన్నో పెంచాలమ్మా
నల్ల రేగళ్లలో నేలకొంగిన పంటలెన్నో పెరగాలమ్మా

కరువు భూమిలో...ఓ...హొయ్
కరువు భూమిలో రైతులకంతా మెతుకు ముద్దను అందిచమ్మా
అన్నదాతకు అమ్మవు నీవే అన్న పూర్ణగా కొలిచామమ్మా
|పెద్ద|

అప్పులు తిప్పలు తీరిపోవాలి ఉప్పెన వంకగ పారాలమ్మా
ఎర్ర గుడిలో గుడినే కడతాం - బెల్లం ఎంకన్ని అల్లుకుపోమ్మా

ఊటకల్లుల్లో....ఓ...హొయ్
ఊటకల్లుల్లో ఊటగ ఊరి పూటకుపూటకు పారాలమ్మా
జొన్నగిరిలో జలజల రాలుతూ, ధాన్యపు రాసులు పండాలమ్మా
|పెద్ద|





వాలింది.



చక్రం దొర్లుకుంటూ పోతోంది. ఇప్పుడు దాని వేగమూ పెరుగుతోంది.

కళ్ళు మూసి తెరిచేంతలో ఈగ మళ్ళీ చక్రం కిందికి చేరుకున్నది తలకిందులుగా.

మళ్ళీ ఎగిరి పైకెక్కి కూర్చుంది టైరు మీద. ఊపిరి పీల్చేంతలో మళ్ళీ చక్రం అడుక్కి చేరుకున్నది.

చక్రం పోతూనే ఉన్నది. క్రింది ఈగ శ్రమ పడి పైకి ఎక్కి కూర్చుంటూనే ఉంది- ఊపిరి వదిలేంతలో అది మళ్ళీ చక్రం అడుక్కి చేరుకుంటోంది.

ఇక ఇది పని కాదనుకున్నది ఈగ.

ఈసారి ఎగిరినప్పుడు అది చక్రం కడ్డీ మీద వాలింది.

ముందుగా అది ఆ కడ్డీ పై వైపుకి పోయింది. అంతలోనే ఆ కడ్డీ నిటారుగా అయిపోయింది! కిందికి జారిపోకుండా ఈగ దాన్ని గట్టిగా పట్టుకున్నది. మరుక్షణంలోనే ఈగ తలకిందులైంది! అయినా దానికి కడ్డీని వదిలేంత ధైర్యం లేకపోయింది. అంతలో అది తల కిందులుగానే నిటారుగా అయ్యింది! ఏం జరుగుతోందో అర్థమయ్యేలోపల మళ్ళీ మామూలుగా అయిపోయింది.

చక్రం ఇంకా వేగంగా పోవటం మొదలుపెట్టింది. ఈగ మాటిమాటికీ నిలువుగా, అడ్డంగా, ఏటవాలుగా అవుతున్నది.

దానికి మొదట్లో సంతోషం అనిపించింది: ' పిల్లలు రంగుల రాట్నంలో ఇలాగే కదా, తిరుగుతారు?' అనుకుందది. కానీ అంతలోనే దానికి కళ్ళు తిరగటం మొదలైంది. కడుపంతా ఏదోలా వికారంగా





# పెద్ద వంకలో గంగమ్మ తల్లి

*పెద్దవంకలో గంగమ్మ తల్లి గలగల*
*గానం: టి.సతీష్, అనిత, శారద, కళావతి.*
*డప్పు: టి. సతీష్*

పెద్దవంకలో గంగమ్మ తల్లి గలగల పారాలి
ఏరువాకలో ఎంకిపాటతో నాగలి నవ్వాలి

సాలు సాలుకు నేలతల్లికి పువ్వులు పూయాలి
బీడు భూముల్లో పంటల పండుగ నిండుగ జరగాలి

కదలి రావమ్మా గంగమ్మ తల్లి రైతు కంటనీరు తుడవాలి తల్లి
కరువు సీమకు కదలి రావమ్మా, పెద్ద వంకగా పారాలమ్మా

పల్లె పల్లెల్లో.....ఓ...హొయ్
పల్లె పల్లెల్లో రైతులు కదిలి నీ రాకకై చూస్తారమ్మా
సాలు సాలుకు నీ సాయంతో వ్యవసాయాన్ని చేస్తారమ్మా
|పెద్ద|

పెద్ద వంకలో పారేటి నీటిలో నెలవంక చూసి మురిసిపోవాలి

వెళ్లినప్పుడు, ఆమెకు అతని నల్ల జుట్టుని చూసి అసూయ వేసేది: ‘తను ముసలిదైపోతూంటే ఈయన కుర్రవాడిలా కులుకుతున్నాడు!’ అందుకని ఆవిడ మొగుడిని కూర్చోబెట్టి, బలవంతంగా అతని తలలోని నల్ల వెంట్రుకల్ని ఒక్కొక్కటిగా పీకేసేది.



అలా కొద్ది రోజుల్లో సోమయ్యకు తలమీద జుట్టు అనేదే లేకుండా పోయింది!



కొత్తపల్లి ఏప్రిల్ 2009

అవుతున్నది.

మెల్లగా అది కడ్డీ లోపలి అంచు వైపుకి జరిగింది-చక్రం కేంద్రం వైపుకు. ఇప్పుడు ఇంకా తొందరగా అది చుట్టూ తిరుగుతున్నది.

బాగాలేదని అది చక్రంలోంచి బయటకు దూకింది, గడ్డిమీదకు. చక్రం ముందుకు పోతూనే ఉంది.

ఈగ గడ్డిమీద నిలబడి, ముందుకు దొర్లుకుంటూ పోతూన్న చక్రం వైపే ఇష్టంగా చూసింది. అప్పుడు దానికో సంగతి అర్థమైంది.

దాని వెనక ఎగురుకుంటూ పోయింది. ఆ చక్రం ఇరుసుమీద వాలింది.

ఇప్పుడది గుండ్రగా తిరగటం లేదు.

రాజా మాదిరి ముందుకే పోతున్నది - సుఖంగా, ఉల్లాసంగా ఉన్నది.

తన తెలివిని చూసుకొని ఈగ పిల్ల చిరునవ్వు నవ్వింది.

చక్రం గుండ్రంగా తిరిగినా ఇరుసు మాత్రం తిరగదని దానికి తెలిసిపోయింది!

# దిగంబర రహస్యం

*సేకరణ: ఆదినారాయణ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ సెంటర్, చెన్నేకొత్తపల్లి.*

ఒక ఋషి అడవుల్లో చాలా సంవత్సరాలు ఘోరమైన తపస్సు చేసి గొప్ప విద్యలు చాలావాటిని సాధించాడు.

ఒకనాడు ఆయన అడవిలో ఒక పెద్ద చెట్టుకింద ధ్యానంలో కూర్చొని ఉండగా హోరు గాలితో కూడిన వాన ఒకటి, మొదలైంది.

అలా మొదలైన వాన చాలా సేపు కొనసాగింది. వానలో తడవకుండా ఉండాలని ఋషి చాలా ప్రయత్నించాడు. దగ్గర్లోనే ఉన్న పొదలచాటుకు వెళ్ళాడు; తను కూర్చున్న చెట్టు మొదలుకు అంటిపెట్టుకుని, ముడుచుకు కూర్చున్నాడు; ఎంత చేసినా వాన చినుకులను ఆయన జయించలేకపోయాడు. బాగా తడిసిపోయాడు.

వాన చాలాసేపు కురిసింది. ఆయన వేసుకున్న ఉత్తరీయం శరీరం మొత్తాన్ని పూర్తిగా కప్పటంలేదు కూడాను, అందువల్ల అసలే శుష్కించిన ఆ ఋషి శరీరం వణకడం మొదలుపెట్టింది.

చాలాసేపు జోరుగా కురిసిన తరువాత వాన ఆగిపోయింది. గాలి





# ఇద్దరు భార్యలు

*ఒక్క పేజీకూడా లేని ఈ చిట్టి కథ అందరినీ మురిపించక మానదు.. చదవండి.*
*మూలం: ఎ.కె.రామానుజన్, ఫోక్ టేల్స్ ఫ్రం ఇండియా.*
*అనువాదం: నారాయణ, కొత్తపల్లి బృందం.*

మధ్యవయస్కుడైన సోమయ్యకు సంతోషం తక్కువైంది. భార్య సుబ్బమ్మ ముసలిదాని మాదిరి అగుపించసాగింది. చివరికి ఆమె ఎంత పోరుతున్నా వినక, రెండో పెళ్లి చేసేసుకున్నాడు.

రెండో భార్య దుర్గ పడుచుది. పేరుకే కాక నిజంగా కూడా దుర్గే. దుర్గమ్మకు, సుబ్బమ్మకు ఒక్క క్షణం కూడా సరిపడేది కాదు. ఇద్దరి మధ్యా కొన్నాళ్లు నలిగిపోయిన సోమయ్య, మధ్యే మార్గంగా ఇద్దరికీ వేర్వేరు ఇళ్లు కట్టించాడు. తనేమో ఒక్కొక్కరిదగ్గరా ఒక్కో రోజు గడిపేటట్లు ఒప్పందం చేసుకొని నవ్వుకున్నాడు ఉల్లాసంగా.

అతను రోజు విడిచి రోజు చిన్న భార్య దగ్గరికి వెళ్ళినప్పుడు, ఆమె అతన్ని కూర్చోబెట్టి, పేన్లు చూసే వంకతో అతని తలలోని తెల్ల వెంట్రుకలని ఒక్కొక్కటిగా పీకేసేది. తన మాదిరే పడుచుగా, తుమ్మెద రెక్కల్లాంటి నల్లని జుట్టుతో కనబడే మొగుడిని చూసుకొని మురిసిపోయేది.

అయితే మరుసటి రోజున సోమయ్య, పెద్ద భార్య సుబ్బమ్మ దగ్గరికి

ఆ సరికి భార్య మేలుకున్నది. "అయ్యో!, ఈయన రాత్రిపూట ఒంటేలుకని లేచి, వెళ్లి మా అమ్మను లేపి మాట్లాడుతున్నాడు. ఇరుగుపొరుగు వాళ్లు ఏమనుకుంటారు?" అని ఆమె లేచి వచ్చింది. "పద, పద. మనం ఈ సంగతులన్నీ తెల్లవారాక మాట్లాడుకుందాం. ఇప్పుడు పడుకోవాలి, పద." అని రెక్క పట్టుకొని తమ గదిలోకి లాక్కుపోయింది.

రాత్రి గడిచి తెల్లవారేసరికి అల్లుడి కష్టాలన్నీ తీరాయి. కొత్తల్లుడి ఠీవీ, దర్పం తిరిగి వచ్చేశాయి. ఇంట్లో వాళ్ళందరి ముఖాలూ కళకళలాడాయి. అందరినీ మురిపించి, ఇంకా సాయంత్రం కాకుండానే ఎవ్వరెంత చెప్పినా వినకుండా ఇంట్లో పనులున్నాయని చెప్పి బయలుదేరాడు కొత్తల్లుడు. చీకటిపడితే వేరే ఎక్కడ ఆగినా పరవాలేదు - ఇంకొక్క రాత్రిని ఇక్కడ గడిపేదెలాగ, మరి?



కొత్తపల్లి ఏప్రిల్ 2009

కూడా తగ్గింది. అడవంతా నిశ్శబ్దం ఆవరించింది. పారే వాననీటి శబ్దాలు స్పష్టంగా వినబడుతున్నాయి.



ఆ సమయానికే, పశువులు కాసే పిల్లవాడొకడు, ఋషి కూర్చున్న చెట్టు ముందునుండి పోతున్నాడు. మేపడం కోసం తను అడవికి తోలుకొచ్చిన పశువులను, వాడు ఊరి వైపుకు తోలుకుపోతున్నాడు. అతని దుస్తులు ఏమాత్రం తడిసిలేవు. పొడిపొడిగా ఉన్న బట్టలతో పిల్లవాడు చాలా హుషారుగా పశువుల్ని తోలుకు పోతున్నాడు. పైగా అతను వానమీద ఒక మంచి జానపదాన్ని రాగయుక్తంగా పాడుతూ పోతున్నాడు, కులాసాగా.

ఋషికి ఆశ్చర్యం వేసింది.

ఆయన అనుకున్నాడు: "ఎన్ని విద్యలు నేర్చినాను, నేను? కానీ వానలో తడవలేకుండా ఉండే విద్యను మాత్రం నేర్చుకోలేదు. ఈ పిల్లవాడ్ని చూస్తే ఏ విద్యా నేర్చినట్లు లేడు, కానీ వానకు ఏమాత్రం తడవలేదుకదా! ఏమిటో ఆ విద్య?" అని.

ఆ రాత్రంతా ఆయనకు సరిగ్గా నిద్ర పట్టలేదు. అంత చిన్న పిల్లవాడు ఇంతటి విద్యను ఎక్కడ నేర్చాడో తెలుసుకోకపోతే ఇక నిద్ర పట్టేటట్లు లేదు. తెల్లవారిన క్షణంనుండీ ఆయన 'ఆ అబ్బాయి ఎప్పుడు పశువులు తోలుకు వస్తాడా' అని ఎదురుచూశాడు. అంతలోనే అబ్బాయి 'హెయ్! డుర్ర్, డుర్ర్ ర్ ర్' అని పశువులను అదిలించుకుంటూ అక్కడికి వచ్చాడు.

ఉండబట్టలేని ఋషి అడిగాడు: "అబ్బాయీ! నిన్న జోరుగా వాన కురిసిన తరువాత కూడా నువ్వు ఏమాత్రం తడవకుండా, పొడిపొడిగా ఉన్న బట్టలతో ఊరివైపుకి పోవడం నేను గమనించాను. ఈ అడవిలో ఆ వానకు తడవకుండా నువ్వెలా ఉండగలిగావు?" అని.

పిల్లవాడు సిగ్గుపడుతూ నవ్వాడు: "ఓ అదా! ఏమీ లేదు స్వామీ! వాన వస్తుందని అనిపించగానే, గోచితప్ప మిగిలిన బట్టలన్నీ విప్పేసి నా దగ్గరున్న లొట్టి (చిన్నకుండ) లోకి దురికేశాను(అదిమి పెట్టాను). ఇక వాన మొదలవగానే ఆ లొట్టిని ఒక రాయిమీద బోర్లించి





అత్తగారు-మామగారు పడుకున్న గదిలోకి చేరాడు. తడుముకుంటూ తడుముకుంటుండగా అతని చేతికి అత్తగారి కాళ్లు దొరికాయి. భార్యకాళ్లే అనుకున్నాడతను, పాపం.

కాళ్లనెవరో పట్టుకొనే సరికి అత్తగారికి గబుక్కున మెళుకువ వచ్చింది. ఆమె కెవ్వున అరిచింది 'ఎవరది?' అని.

"నేను, నేను " అన్నాడు కొత్తల్లుడు.

'ఇంత రాత్రి పూట ఇక్కడేం చేస్తున్నావు?' అన్నది ఆవిడ.

అల్లుడికి తన తప్పు అర్థమైంది ఈ పాటికి. అతనన్నాడు "అబ్బే, మరేంలేదు. మీరు అన్నం వడ్డిస్తుండగా నేను మీ మీదకి పీట విసిరేశానుగదా, అందుకు నేను చాలా చింతిస్తున్నాను. మీరు నన్ను క్షమించాలి. నేను మీ కాళ్లు పట్టుకొని క్షమాపణ అడగాలనుకున్నాను, అడిగాను. అంతే. నావల్ల తప్పు జరిగింది. క్షమించండి." అని.

అల్లుడి మాటలు విని అత్తగారికి మరింత సిగ్గైంది. "అయ్యో ఏమీ ఫరవాలేదులే. వెళ్లి పడుకోండి" అన్నది.

కానీ అల్లుడు ఆమె కాళ్లు వదలలేదు. "నన్ను క్షమించాలి. క్షమించాల్సిందే" అంటున్నాడు కళ్లు మూసుకొని, తల ఊపుకుంటూ.

అతను దాన్ని గిరగిరా తిప్పి తన ముందుకొచ్చి నిలబడ్డ ఆకారం మీదికి విసిరాడు బలంగా. అత్తగారు కీచుమంటూ వంటగదిలోకి పరిగెత్తింది, దాన్నించి తప్పించుకొనేందుకు. తను సాయంత్రం చెత్త, పేడ వేసినందుకుగాను అల్లుడు తనపై కోపగించుకుంటున్నాడని ఆవిడ బలంగా నమ్మింది.

ఇక, "తన భార్య కాకుండా అత్తగారు వడ్డించినందుకు బావ నొచ్చుకున్నాడని మిగిలిన బావమరుదులు అనుకున్నారు. వెంటనే అతని భార్య బయటికి వచ్చి, మిగిలిన వడ్డనంతా నిర్వహించి, అయిందనిపించింది.

భోజనాలైనాక అందరూ వేర్వేరుచోట్ల పడుకునేందుకు వెళ్ళిపోయారు. అల్లుడు, కూతురు పడుకునేందుకు ఒక చిన్న గదిని కేటాయించారు. చిన్న బావమరుదులంతా బయట వరండాలో పడుకున్నారు. మధ్యరాత్రి అల్లుడుగారికి మెలుకువ వచ్చింది - "మూత్రాశయం నిండిపోయింది. ఖాళీ చేసుకోనిదే పని జరగదు." కానీ ఎలాగ?

అత్తగారింటిని తనకు గుర్తున్నంతమేర గుర్తుకుతెచ్చుకొని, గోడలు పట్టుకొని కొలుచుకుంటూ, అతి కష్టం మీద స్నానాల గదిని కనిపెట్టి, పని కానిచ్చాడు. అయితే ఎంత గుర్తుపెట్టుకుందామనుకున్నా నిద్రమత్తులో వెనక్కి రావటంలో దారితప్పి, తమ గదికి బదులు





పెట్టేశాను. నేను వెళ్ళి చెట్టుకింద నెమర్లు వేస్తూ నిలబడి ఉన్న నా బంగారు ఆవుల నీడన కూర్చున్నాను- అంతే. నేనూ పెద్దగా తడవలేదు; నా బట్టలు అసలే తడవలేదు" అన్నాడు.

వానకు తడవని విద్యలోని మర్మం అర్థమైన ఋషి చిరునవ్వు నవ్వాడు.

# దెబ్బకు దెబ్బ

*రచన: మంజునాథ్, కొత్తపల్లి బృందం*

అనగనగా ఒక ఊరు. ఆ ఊళ్లో సుబ్బన్న అనే రైతు ఉండేవాడు. ఆయనకి కొద్దిపాటి పొలం, కొన్ని ఆవులు ఉండేవి. పంటలో కంటే పాలలోనే త్వరితమైన రాబడి ఉండటం చేత తన దగ్గరున్న ఆవుల సంఖ్యను ఎక్కువ చేసుకున్నాడు సుబ్బన్న. చివరికి సుబ్బన్న దగ్గర ఆవుల సంఖ్య ఎంత ఎక్కువైందంటే ఆయనకిక తన ఆవుల్లో ఒకదాన్ని కొట్టం బయట కట్టేయక తప్పలేదు- కొట్టంలో చోటు లేదుమరి!

తన దగ్గరున్న ఆవులన్నింటిలోకీ అణకువైన ఒక సన్నని ఆవును బయట కట్టేస్తున్నాడిప్పుడు సుబ్బన్న. ఆ ఆవు చాలా మంచిది. అది ఎంత మంచిదంటే, ఏ సమయంలోనైనా పాలిచ్చేది మంచిగా. దూడను వదలాల్సిన పనికూడా లేకుండానే పాలిచ్చేంత సాధువైన ఆవు అది.

సుబ్బన్న దగ్గర ఒక మంచి కోడిపుంజు కూడా ఉండేది. రోజూ ఇంకా తెల్లవారకుండానే అది తన గంభీరమైన కూతతో వీధిలోని వారందర్నీ నిద్రలేపేది. ప్రతి రోజూ ఆ కోడిపుంజు కూసే మూడవ కూతకు





వదిలింది ఆ పొట్టేలు, కొత్త అల్లుడనైనా చూడకుండా.

కొత్తబావ అరుస్తూ కిందపడిపోగానే బావమరిది పొట్టేలును గట్టిగా ఓ దెబ్బ వేసి తరిమాడు. ఆపైన, బావగారికి లేచేందుకు చేయి అందిస్తూ "అక్కడ పొట్టేలు ఉండగా చూసుకోలేదా బావా?" అని అడిగాడు.

"ఓహ్, నేను దాన్ని చూడకేం? దాని వాలకం నచ్చి, ఓసారి గట్టిగా రుద్ది ముద్దు చేద్దామనుకున్నాను. కానీ చూడు, అది ఏం చేసిందో! కొత్తవాళ్లతో ఇలా ప్రవర్తించమని నేర్పిస్తారా, మీరు?" అన్నాడు అల్లుడు.

ఆ పాటికి చీకటి పడిపోయింది. అందరూ నేల మీద వరసగా భోజనాలకు కూర్చున్నారు. వాళ్లముందు పీటలమీద వడ్డించిన విస్తళ్లున్నాయి. కొత్త అల్లుడు ఇంటికి వచ్చిన ప్రత్యేక సందర్భం కనుక స్వయంగా అత్తగారే వంగి వంగి వడ్డిస్తున్నారు. ఆవిడ లేచి నిలబడ్డప్పుడూ, వంగినప్పుడూ, నడిచినప్పుడూ, అడుగు అడుగుకూ ఆమె ధరించిన వెండి ఆభరణాలు ఘల్లు ఘల్లుమంటున్నాయి. అల్లుడిని అకస్మాత్తుగా భయం ఆవరించింది. "ఇందాక తనను కుమ్మిన పొట్టేలు, ఎలా వచ్చిందో మరి, మళ్లీ ఇక్కడికి వచ్చింది - తనను కుమ్మబోతున్నది" ఈ ఆలోచన వచ్చిన మరుక్షణం విస్తరి కింద ఉన్న పీట అల్లుడి చేతిలోకి వచ్చేసింది.

పడిపోయాడు. "ఏమైంది? మీకు చూపు సరిగ్గా ఆనదా, ఏమిటి? అన్నాడు బావమరిది ఒకింత అనుమానంగా.

"అయ్యో, నాకు బాగానే కనబడుతుంది. మీ ధాన్యపు కల్లం ఎంత లోతున్నదో చూడాలని ఇందులోకి దూకాను అంతే. మా ఇంట్లో ఇలాంటిదే ఒకటి చేయిస్తున్నాను. ఊఁ, ఇప్పుడు ఓసారి చేయి అందించు - అద్దీ, అలాగ. నువ్వు మంచి బావమరిదివోయ్!" అంటూ రేచీకటి అల్లుడు మళ్లీ నేలమీదికి ఎగబ్రాకాడు. ఇక అక్కడ అతనికి ఒక గోడ దొరికింది. ఆ గోడను ఆధారంగా చేసుకొని, దాన్ని వదలకుండా పట్టుకొని నడవటం మొదలెట్టాడతను.

"బావా, ఇదేంటి? నువ్వు ఇట్లా గోడను పట్టుకొని గోడ వెంబడే నడుచుకొని వస్తున్నావు? నీ కళ్లు సరిగ్గానే ఉన్నాయికదా?" అడిగాడు చిన్న బావమరిది.

"ఛ, ఛ.! నువ్వేం మాట్లాడుతున్నావు? ఏదో ముచ్చటకొద్దీ మీ ఇంటి ప్రహరీగోడ ఎంత పొడవున్నదో కొలుస్తున్నాను నేను." అని సర్దుకున్నాడు అల్లుడు.

ఇంటి వాకిట్లోనే అత్తగారు గొర్రె పొట్టేలును ఒకదాన్ని కట్టివేసి ఉంచారు. బావా బావమరుదులు ఇద్దరూ ఇంటికి చేరుకోగానే హడావిడిగా లోనికి పోబోయిన అల్లుడు, నేరుగా ఆ పొట్టేలు మీదికే ఉరికాడు. ఏమీ అర్థం కానట్లు చెలరేగి, కొమ్ములతో పొడిచి పొడిచి





సుబ్బన్న మేలుకొని, పాలు పిండటానికి కొట్టంలోకి పోయేవాడు.



సుబ్బన్న దినచర్యను గమనించిన పక్కింటామె- పిసినారి పుల్లమ్మ-కు ఒక దురాలోచన వచ్చింది: ఇక ఆమె రోజూ తొలి కోడి కూతకే మేలుకోవడం మొదలెట్టింది. లేచిన వెంటనే గబగబా సుబ్బన్న దొడ్లోకి పోయేది; కొట్టం బయట కట్టేసి ఉంచిన ఆవు పాలన్నీ చకచకా పిండేసుకొని, ఇంటికి పారిపోయేది.

పాపం, మూడో కోడికూతకు మేలుకొన్న సుబ్బన్న దొడ్లోకి పోయి చూస్తే, బయట కట్టేసిన ఆవు పాలిచ్చేది కాదు! కారణం అర్థంకాక సుబ్బన్న అయోమయంలో పడిపోయాడు ఓ నాలుగు రోజులు. ఇక లాభం లేదని, తానే స్వయంగా కాపలా ఉండి, ఒక రాత్రంతా మేలుకుని చూశాడు-మాయమవుతున్న ఆవుపాలన్నీ ఎటు

పోతున్నాయో తెలుసుకునేందుకు.

కోడి కూసిందో లేదో, ఒక స్త్రీ రూపం దొడ్లో ప్రత్యక్షమైంది. అది నేరుగా ఆవు దగ్గరకే వెళ్ళి, ఆత్రంగా పాలన్నీ పిండుకున్నది. ఆపైన ఆ ఆకారం పక్కనుండే పుల్లమ్మ ఇంట్లోకి పోయింది. చూస్తున్న సుబ్బన్నకు విషయం అర్థం అయ్యింది. రోజూ పాలన్నీ పిండుకుపోతున్న పుల్లమ్మకు గట్టి గుణపాఠం చెప్పాలనుకున్నాడు.

ఆ రోజునే కోడిపుంజుని తమ బంధువుల ఇంటికి పట్టించి పంపాడు. చీకటి పడుతుండగా తమ వీధిలోనే ఉండే చాకలి పుల్లన్న ఇంటికి వెళ్ళి, అతని గాడిదను ఒక్క రాత్రికి తన దొడ్లో కట్టేసుకుంటానని అడిగాడు. సుబ్బన్నయితే పశువులకు మంచి పచ్చిగడ్డి వేస్తాడు. గాడిదకు ఆ రాత్రి పండగేమరి. అందుకనే, 'ఒక్క రాత్రేమిటి? ఎన్ని రాత్రులైనా సరే, పట్టుకు పొమ్మ'న్నాడు పుల్లన్న.

ఇక సుబ్బన్న రోజూ కొట్టం బయట ఆవును కట్టేసే స్థానంలో ఆ గాడిదను కట్టేసి, దానికి బాగా పచ్చిగడ్డి వేశాడు. దొరక్క దొరక్క పచ్చిగడ్డి దొరకడంతో కడుపుబ్బేట్టుగా తిన్నది ఆ గాడిద. చీకట్లో ఎవరైనా చూస్తే, దాన్ని ఆవే అనుకుంటారు.

అన్నీ అమర్చిన తరువాత సుబ్బన్న ఒక మూలగా చోటు చూసుకుని హాయిగా నిద్ర పోయాడు.





మొదలుపెట్టాడు. కొంచెం దూరం పోయేసరికి బర్రెలు అతని కళ్లముందు మసక మసకగా భూతాల మాదిరి కనబడ్డాయి. "ఓయ్! ఇవేమిటి?" అని అడిగాడతను.

"అవి మన బర్రెలే. నేను వాటిని మేపటం కోసం అడవికి తీసుకెళ్లాను. ఇప్పుడు ఇంటికి తిరిగి వస్తున్నాయి." అన్నాడు బావమరిది.



"ఓహో... బాగున్నై బాగున్నై. పెద్దగా, ఆరోగ్యంగా ఉన్నై" అన్నాడు కొత్త అల్లుడు ఒక బర్రెను అదిమి, దాని తోకను చేతిలోకి తీసుకుంటూ. ఇక ఆ పైన అతను బర్రె తోకను ఆధారంగా పట్టుకొని ధైర్యంగా నడవటం మొదలెట్టాడు- ఏమీ కనబడకపోయినా.

దారి చూపే ఆ బర్రె ధాన్యం నిలువచేసే కల్లాల పక్కనుండి పోతూండగా, కాలుజారి నేరుగా ధాన్యపు కల్లంలో కొత్తల్లుడు

దారిలో ఆమెకు తన చిన్నకొడుకు-పదేళ్లవాడు- కనబడ్డాడు. వాళ్ళ బర్రెల్ని వాడు ఇంటికి తోలుకు పోతున్నాడు. అమె గబగబా వాడి దగ్గరకు పోయి - "ఒరే, చూడు, మీ కొత్త బావ వచ్చాడు - కానీ ఎందుకో మరి, ఆయన మన పేడ దిబ్బలో కూర్చుని ఉన్నాడు. మూత్ర విసర్జనకు వెళ్ళి ఉంటాడు బహుశ:. అయితే నేను ఆయన్ని గమనించకుండా చెత్త, పేడ అంతా ఆయన నెత్తినే కుమ్మరించాను. ఆయన చాలా కోపగించుకొని ఉండాలి. నువ్విప్పుడు వెంటనే పరిగెత్తిపోయి, ఎలాగోలా ఆయన్ని శాంతపరిచి, ఒప్పించి, మెల్లగా మనింటికి పిలుచుకురావాలి. ఆయనకి నువ్వంటే ఇష్టం. నీ మాట కాదనడు". అన్నది.

పిల్లవాడికి కూడా కొత్త బావ అంటే చాలా ఇష్టం. వాడు " ఓ బావా? ఎక్కడున్నావ్ నువ్వు?' అని దారంతా అరుచుకుంటూ పరిగెత్తాడు. వాడు వెళ్లేసరికి, కొత్త బావ ఇంకా పేడదిబ్బలోనే కూర్చుని ఉన్నాడు.

"నువ్విక్కడ ఎందుకు కూర్చుని ఉన్నావు? రా, మన ఇంటికి పోదాం" అని వాడు కొత్త బావ చేయి పట్టుకొని లాగాడు. కొత్త బావకి రేచీకటి ఉన్నది తప్పిస్తే, తెలివి బాగానే ఉన్నది. అతనన్నాడు - "నేనిక్కడ ఊరికే కూర్చోలేదురా బాబూ! మీ దిబ్బలోంచి ఎన్ని బళ్ల ఎరువు అవుతుందో లెక్కగడుతూ ఉన్నాను. ఒకటి రెండెకరాలకు సరిపడా ఎరువు ఉంది ఇక్కడ". అలా అంటూనే అతను ఆప్యాయంగా పిల్లవాడి భుజంపై చేయి వేసి అతనితో పాటు నడవటం





ఇక మరునాడు తెల్లవారుజామున కోడి కూయలేదు.

రోజూ సరైన సమయానికి వచ్చే పుల్లమ్మ ఆ రోజు కాస్త తడబడి, "అయ్యో! చాలా ఆలస్యమైందే" అన్నట్లు, గబగబా దొడ్లోకి ప్రవేశించి నేరుగా 'ఆవు' దగ్గరికి పోయింది. ఆత్రంలో దాని ఆకారాన్నిగానీ, పరిమాణాన్ని గానీ గమనించకుండానే, పాలను పిండేందుకు కూర్చుంది. అలా కూర్చుందో లేదో ధబీమని ఒక గట్టి తన్ను శబ్దం, ఆ వెంటనే టంగుమన్న ఇత్తడి కుండ శబ్దం, 'అయ్యో'మన్న అరుపు వెలువడ్డాయి. బెదురుకున్న గాడిద పుల్లమ్మను మళ్ళీ మళ్ళీ తన్ని ఒళ్ళు హూనం చేసేసింది!

దొంగ దొరికిపోయింది. తన తప్పుకు పరిహారంగా పుల్లమ్మ ఒక వారం రోజులపాటు సుబ్బన్న గొడ్లకు ఉచితంగా చాకిరీ చేయవలసి వచ్చింది! దానికి తోడు విరిగిన ఎముకలు సరిచేయించుకునేందుకు చాలా డబ్బులూ ఖర్చైనాయి!

# ఒక ప్లేగు కథ

*సంతోషం సగం బలాన్ని ఇస్తుందంటారు, కానీ భయంమాత్రం బలాన్ని పూర్తిగా హరిస్తుంది. అద్భుతమైన ఈ బెంగాలీ జానపద కథని తప్పక చదవాలి, అందరూ.*

*సేకరణ: ఎ.కె. రామానుజన్, ఫోక్ టేల్స్ ఫ్రం ఇండియా.*

*అనువాదం: నారాయణ*

ఒకసారి ఆసియా ఖండం అంతటా ప్లేగు వ్యాధి వ్యాపించి వేలాది మందిని పొట్టన పెట్టుకున్నది. నాటి భారతదేశపు చక్రవర్తి ధార్మికుడు. ఆయన దేశంలోని విద్వాంసులను, పండిత బ్రాహ్మణులను అందరినీ సమావేశపరిచి "ప్లేగువ్యాధి మన రాజ్యపు పొలిమేరల వరకూ వచ్చింది. మన ప్రజల్ని కాపాడుకోవాలంటే మనం ఏం చేయాలో చెప్పండి" అని అడిగాడు.

పండితులు అనేక శాస్త్రచర్చలు చేసిన తరువాత" మహారాజా, ఇది శివ భగవానుని ఆగ్రహ జ్వాల అని తోస్తున్నది. కాబట్టి మనం శివపరమాత్ముని కోపాన్ని శమింపజేయటం కోసం పూజలు, హోమాలు దేశమంతటా నిర్వహించాలి" అన్నారు. రాజుగారు వెంటనే ప్రజలంతా ఇండ్లలోనూ, దేవాలయాల్లోనూ విధిగా శివ పూజాదికాలు నిర్వహించాలని చాటింపు వేయించారు. దానికయ్యే





అని.

చీకటి పడకముందే మామగారింటికి చేరుకోవాలనే ఆత్రం కొద్దీ అల్లుడు చాలా వేగంగానే ప్రయాణించాడు; కానీ ఆ ఊరి పొలిమేరలు చేరేసరికి ప్రొద్దుగుంకి పోయింది. రేచీకటి అల్లుడికి ఇప్పుడు ఇక ఏమీ కనిపించటం లేదు. తల్లి ఉపదేశాన్ని గుర్తుకు తెచ్చుకొని, తడుముకుంటూనే అతను ఒక ఎత్తైన స్థలాన్ని చేరుకొని, అక్కడే కూర్చుండిపోయాడు - ఎలాగో ఒకలా రాత్రి గడిస్తే చాలు' అనుకుంటూ.

అయితే దురదృష్టం కొద్దీ, అతను కూర్చుండిన ఆ స్థలం వేరేదేదో కాదు - అతని అత్తింటివారి పేడ దిబ్బనే! అల్లుడు అలా కూర్చున్నాడో లేదో, అత్తగారు ఆ నాటి చెత్తా చెదారం, పేడ అన్నీ తీసుకొచ్చి దిబ్బలోకి వేసేసింది - సూటిగా అల్లుడి నెత్తిమీదే!

అకస్మాత్తుగా తలపై ఏదో వచ్చి పడేసరికి భయపడ్డ అల్లుడు 'అయ్యో!' అని మొత్తుకున్నాడు - అత్తగారు నిర్ఘాంతపోయి చూస్తే - ఏముంది? అక్కడ తమ- గౌరవనీయుడైన అల్లుడు- ఉన్నాడు, నిండా పేడలో మునిగి! "కొత్త అల్లుళ్లను దేవతలతో సమానంగా చూడాలి, మరి తనేం చేసింది? అయ్యో ఎంత అపచారం!" అని అత్తగారి మనసు ఘోషించింది. పశ్చాత్తాపంతో ఆమె తన ముఖాన్ని చీర చెంగులో దాచుకొని, ఇంటికి పరిగెత్తింది.

# రేచీకటి అల్లుడు

*రేచీకటి అల్లుడి కథ మన తెలుగుదే, కోస్తా ప్రాంతంలో ఒకప్పుడు బాగా వినిపించిన ఈ కథ, ఏ కారణం వల్లనో చాలా మందికి అందకుండా పోయింది. రామానుజన్ గారు సేకరించి దీన్ని గ్రంథస్థం చేశారు. ఆయనకు ధన్యవాదాలతో, ఈ కథ మీకోసం. మూలం: ఎ కె రామానుజన్, ఫోక్ టేల్స్ ఫ్రం ఇండియా. అనువాదం: నారాయణ, కొత్తపల్లి బృందం.*

ముసలి వితంతువు ఒకావిడకు ఒక్కడే కొడుకు. అతనికి రాత్రిపూట చూపు సరిగా ఆనేది కాదు. అయితే ఆ సంగతిని దాచిపెట్టి, ఆమె తన కొడుక్కు ఒక మంచి కుటుంబం నుంచి వచ్చిన మంచి పిల్లను చూసి పెండ్లి చేసింది. "తర్వాత కోడలికి తెలిసినా ఏమీ అనదు. ఎటొచ్చీ ఈ సంగతిని ఆ పిల్ల అన్నదమ్ములకు మాత్రం తెలియనివ్వకూడదు" అనుకున్నది గడుసు ముసలమ్మ.

పెళ్లైన తర్వాత సంక్రాంతి పండగ వచ్చింది. పండక్కి కొత్త అల్లుడిని ఆహ్వానించారు అత్తింటివారు. గడుసు ముసలమ్మ కొడుకును ముందుగానే హెచ్చరించింది - "జాగ్రత్తరా నాయనా! చీకటి పడిందంటే నీకు ఏ ఒక్క వస్తువూ కనబడదు. అందుకని చీకటిపడ్డ తర్వాత ఎక్కువగా బయట తిరక్కు. పగటిపూట మాత్రమే ప్రయాణించు. మీ మామగారింట్లో ఒక్క రాత్రికి మించి ఉండకు"





ఖర్చును కోశాగారం నుండి చెల్లిస్తామనికూడా ఉదారంగా ప్రకటించారు.



పండితులంతా పూజలు మొదలుపెట్టిన తర్వాత వారానికి, మహేశ్వరుడు పెద్ద పూజారి కలలో కనిపించాడు. "మీకేం కావాలి?" అని అడిగాడు. పూజారిగారికి సంతోషంతో ఒళ్ళు పులకరించింది. ఆయన ఈశ్వరునికి సాష్టాంగ నమస్కారం చేసి "స్వామీ, సమస్తలోకరక్షకా, శివా, మేం కోరేదేమిటో మీకు తెలుసు. మా రాజ్యం వైపుకు దూసుకువస్తున్న ప్లేగునుండి మమ్మల్ని కాపాడు" అని ప్రార్థించాడు. శివుడు "తథాస్తు! మీ ప్రార్థనలకు నేను చాలా సంతసించాను. నా భృత్యుడైన నంది మీ రాజ్యాన్ని ప్లేగు బారిన

పడకుండా కాపాడతాడు" అని అంతర్థానం అయిపోయాడు.

మరునాడు ఉదయాన ఆ శుభవార్త రాజుగారికి చేరింది. ఆయన గుండెలమీది భారం తగ్గింది. సంతోషపూర్వకంగా రాజుగారు ఒక్కొక్క పండితుడికీ 25 పాడిఆవుల్నీ, 50 బస్తాల ధాన్యాన్నీ ఇచ్చి సత్కరించి పంపాడు.

ఇక, నంది రాజ్యపు పొలిమేరల్లో అంతటా పహారా కాస్తున్నాడు దీక్షగా. ప్లేగు ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి చొరకుండా రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నాడు. ఒకనాటి రాత్రి, ఆయన గస్తీ తిరుగుతున్న సమయంలోనే, ప్లేగు వ్యాధి ఒక భయంకరమైన ఆకారం ధరించి ఆయన ముందు ప్రత్యక్షమైంది - "నేను రాజ్యాన్ని కబళించి తీరతాను" అంది గర్జిస్తూ. నంది త్రిశూలాన్ని పైకెత్తి "దుర్మార్గుడా, నా కళ్లముందు నిలువకు. పారిపో. ఒక్క అడుగు ముందుకు వేసినా, నీ పని అంతటితో సరి" అని ఎదుర్కొన్నాడు. ప్లేగువ్యాధి వెనక్కు తగ్గలేదు; దాంతో నందికి, ప్లేగుకు నడుమ ఘోరయుద్ధం మొదలైంది. ఆ యుద్ధంలో పర్వతాలు సైతం పిండి పిండి అయిపోయాయి. పురాతన వృక్షాలు పెకిలింపబడ్డాయి. నదులు పొంగి పొర్లాయి. యుద్ధం అనేక రోజులు సాగింది. చివరికి ఇరువురికీ సంధిబాట పట్టక తప్పలేదు. అతి కష్టం మీద ఇద్దరికీ రాజీ కుదిరింది - దాని ప్రకారం, ప్లేగువ్యాధి రాజధానిలో కేవలం ఒక్కరోజు పాటు మాత్రమే ఉంటుంది; కేవలం ఒక్క మనిషిని మాత్రమే కబళిస్తుంది.





అయితే ఆ మర్నాటి సాయంత్రం నగరమంతా గగ్గోలెత్తింది. ఒకరు కాదు, ఇద్దరు కాదు, వందమంది ప్లేగుబారిన పడ్డారన్న వార్తలు నగరాన్ని అతలాకుతలం చేశాయి. రాజుగారు వెంటనే పండితులను పిలిచి కారణమడిగాడు. వాళ్ళంతా వెంటనే నందిని ప్రార్థించి కారణం అడిగారు. నందికి పట్టరాని కోపం వచ్చి ప్లేగు కోసం వెతుక్కుంటూ తిరిగాడు. చివరికి ఒక శిథిలగృహపు దుమ్ముగొట్టిన నేల చీలికలో నక్కిఉన్న ప్లేగును పట్టుకున్నాడు. దాని మెడ పట్టుకొని బయటికి లాగి, నంది - "నీచుడా! నువ్వు నీ మాట నిలుపుకోలేదు. ఒక్క మనిషిని బలి తీసుకుంటానని చెప్పి నువ్వు ఇప్పటికి ఒకరిని కాదు, వందమందిని పొట్టన పెట్టుకున్నావు. నువ్వు దీనికి తగిన మూల్యం చెల్లిస్తావు" అని గర్జించాడు.

నంది మెడపట్టుతో ఉక్కిరిబిక్కిరవుతూ కూడా, ప్లేగు వికవికా నవ్వాడు. "సోదరా, నేను మాట తప్పలేదు. నాపై కోపగించుకోకు. నేను నీకు ఇచ్చిన మాట ప్రకారం ఒక్కరినే కబళించాను. కానీ మిగిలిన తొంభైతొమ్మిది మందీ భయంతో చనిపోయారు. నేనేం చేసేది? వీళ్లకు మామూలు జ్వరం, కొన్ని గ్రంథుల వాపు వచ్చాయంతే. దాన్నే నా రాక అనుకొని వాళ్ళు భయం కొద్దీ చచ్చిపోయారు- అంతేతప్ప వాళ్ల మృతికి నిజంగా నేను కారణం కాదు" అన్నాడు. నంది పట్టు వదిలాడు. ప్లేగు గాలి పీల్చుకున్నాడు.